# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని దేశ ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు**

2. **దీపావళి పండుగ సందర్భంగా దేశ ప్రజలకు రాష్ట్రపతి, ప్రధాన మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

4. **తెలంగాణలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థను తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**

5. **రైతుల సాధికారతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు.**

============================

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ రోజు దీపావళిని దేశ ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. ప్రతి ఏటా ఆశ్వీయుజ మాసం బహుళ అమావాస్య రోజున ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీ కృష్ణుడు సత్యభామ సమేతంగా నరకాసురుడనే రాక్షసుని సంహరించినందుకు ప్రజలు సంతోషంగా దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నట్టు పురాణాలు పేర్కొంటున్నాయి. పదునాలుగేళ్ల అరణ్యవాసం పూర్తి చేసుకుని శ్రీ రాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో కూడా ప్రజలు సంతోషంతో దీపాలు వెలిగించినట్టు రామాయణ ఇతిహాసం పేర్కొంటోంది.

దీపావళి పండుగ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల గవర్నర్లు ఎస్. అబ్దుల్ నజీర్, జిష్ణు దేవ్ వర్మ, ముఖ్య మంత్రులు నారా చంద్ర బాబు నాయుడు, ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడ భవానీపురంలోని పున్నమిఘాట్ వద్ద గత సాయంత్రం నిర్వహించిన దీపావళి

వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమం అమలుతో పాటు ఉద్యోగులకు కూడా ఆర్థిక ప్రయోజనాలు కల్పించామన్నారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రతి కుటుంబానికి మేలు కలుగుతుందని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 36 సెకన్లు

అంతకుముందు విజయవాడ నగరంలోని బీసెంట్ రోడ్డులో ముఖ్యమంత్రి పర్యటించి చిరు, వీధివ్యాపారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జీఎస్టీ సంస్కరణల ద్వారా వారికి కలుగుతున్న ప్రయోజనాల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

\-------------------------

ఆంధ్రప్రదేశ్ ని కృత్రిమ మేధ–ఏఐకి కేంద్రంగా మారేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో విశాఖ భాగస్వామ్య సదస్సు నిర్వహణపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, విశాఖపట్నంలో నవంబరు 14,15 తేదీల్లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సులో పెట్టుబడులతో పాటు పాజిటివ్ పాలసీ మేకింగ్‌పై కూడా చర్చ జరగాలన్నారు. కేవలం పెట్టుబడులు, ఒప్పందాలకే పరిమితం కాకుండా నాలెడ్జ్ షేరింగ్, వివిధ అంశాలపై మేధోమథనం జరిగేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

\-------------------------

తెలంగాణలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థను తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు. భూమి కొలతలు– భూదస్త్రాల నిర్వహణశాఖ పరిధిలో కొత్తగా నియమించిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన నిన్న లైసెన్సులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, భూ భారతి చట్టంతోపాటు గ్రామ పాలన అధికారులను నియమించి గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. భవిష్యత్‌లో భూ యాజమాన్య హక్కులు, సరిహద్దులను నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అప్పగించనుందని చెప్పారు.

\-------------------------

మైనారిటీల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఒక ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్య, క్రీడలు, వ్యాయామం తదితర రంగాలలో సేవలు అందించిన పలువురికి అవార్డులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనారిటీలు అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల నోటిఫికేషన్ల విడుదల సమయంలో ప్రత్యేక శిక్షణ ఏర్పాట్లు, ఉర్దూ భాషాభివృద్ధికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.

\-------------------------

రైతుల సాధికారతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండలో వ్యవసాయ అవసరాలకు వినియోగించేలా అర్హులైన రైతులకు 70 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఆమె నిన్న పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 22 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వస్తు సేవల పన్ను-జీఎస్టీ సంస్కరణల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూరుతోందని విజయనగరం శాసనసభ్యురాలు అదితి గజపతి రాజు అన్నారు. విజయనగరంలోని స్థానిక సంగీత కళాశాలలో ఏర్పాటు సూపర్ జిఎస్టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆమె నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదితి గజపతి రాజు మాట్లాడుతూ జీఎస్టీలో రెండు స్లాబులను అమలు చేయడం ద్వారా ప్రజలతో పాటు వ్యాపారులకు ఆర్థిక మేలు కలుగుతోందని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 24వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఇండోర్ వేదికగా నిన్న జరిగిన క్రికెట్ మ్యాచ్ లో ఇంగ్లాండ్ విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ 50 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 288 పరుగులు చేసింది. అనంతరం 289 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన భారత జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. దీంతో 4 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ జట్టు గెలుపొందింది.

---------------------------

దక్షిణ మధ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో రానున్న నాలుగు రోజులలో వాయుగుండం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఇది రేపటికి అల్పపీడనంగా బలపడి, ఆ తర్వాత వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో నాలుగు రోజుల పాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్ నారాయణ తెలియజేస్తూ,

వాయిస్ 27 సెకన్లు

అలాగే తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి ఒక మోస్తరు నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================